సేవా కార్యక్రమాలు విస్తృతం చేయండి : 'నల్లారి'

కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లారి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : అమరవీరుల స్ఫూర్తితో ముస్లిం యువత సమా జంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కలికిరిలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితీ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుల చిత్రాలతో కూడిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడి అమరులైన వీరుల చిత్రాలతో కూడిన క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మైనార్టీల అభివృద్ధికి తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, నాయకులు సయ్యద్ బాష, కువైట్ సయ్యద్‌బాష, షబ్బీర్, షఫీ, మస్తాన్, బషీర్, మస్తాన్, పీర్‌బాష, మౌల పాల్గొన్నారు.

కీచక డిటిసిపై సరెండర్ వేటు

- **బాధిత మహిళలకు అండగా ఉంటాం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**
- **జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విచారణ**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

కడప రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిపై సరెండర్ వేటు పడింది. మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించినట్లు అతడిపై ఆరోప ణలు ఉన్నాయి. గురువారం మహిళా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఇంటికి వెళ్లి డిటిసి వేధించాడు. అతడికి మహిళా ఉద్యోగి కటుంబ సభ్యులు శుక్రవారం దేహశుద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అతడిని రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా రవాణా శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి భర్త పొరుగు జిల్లాలో పనిచేస్తున్నారనే తెలుసుకుని సదరు ఉద్యోగిని ఇంటికి వెళ్లి వేధించడంతో వ్యవహారం పరాకాష్టకు చేరుకుంది. దీనికి ఆమె విసిగిపోయి పొరుగు జిల్లాలో పనిచేస్తున్న తన భర్తకు తెలిపింది. సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసిన సిసి కెమెరాల సహాయంతో పరిస్థితిని సమీక్షించుకున్న అనంతరం మరుసటి రోజుకు కడపకు చేరుకుని భార్యతో కలిసి డిటిసి కార్యాలయానికి వెళ్లి చితకబాదడంతో లైగింక వేధింపుల ఘటన మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. మరో మహిళా ఉద్యోగి పట్ల లైగింక వేధింపులకు పాల్పడడంతో ఆమె సెలవుపై వెళ్లిపోయినట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో పనిచేసిన సమయంలోనూ ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తాజా లైంగిక వేధింపుల ఘటన పట్ల సీరియస్‌గా స్పందించడంతో రవాణా శాఖ అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆగమేఘాల మీద సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రవాణా శాఖా మంత్రి సదరు అధికారి ప్రవర్తన పట్ల సీనియర్ అధికారితో సమగ్ర విచారణ చేసిన అనంతరం శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటన విడుదల చేశారు. అనంతరం ఆయన సదరు ఉద్యోగిని, కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి భయపడొద్దని అండగా ఉంటామని హామీ నిచ్చారు. ఇప్పటికే నిందితునిపై చర్యలకు ఆదేశాలు జారీ చేశామని, శిక్షపడేలా చేస్తామని భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వం మహిళలపై లైంగిక వేధింపుల పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించడం గమనార్హం.

జెటిసి విచారణ : తాజా లైంగిక వేధింపుల ఘటనపై జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ ప్రారంభమైంది. డిటిసి కార్యాలయ ఉన్నతాధికారి బాధిత మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన తీరుపై బాధిత ఉద్యోగి, ఆమె భర్త నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు సమాచారం. లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి సదరు ఉన్నతాధికారి వ్యవహార

సరళిని సిసి పుటేసి ఆధారంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలుస్తోంది. రవాణా శాఖ సర్వీస్ రూల్స్ మాన్యువల్ ప్రకారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు ఉండ కూడదని, ప్రభుత్వ సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ పేర్కొనడం గమనార్హం.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఉద్యోగినిలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ డిటిసి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ డిమాండ్ చేశారు. శుక్రవారం డిటిసి కార్యాలయం వద్ద నిరసనలో ఆయన మాట్లాడుతూ టిడిసిని ఉద్యోగం నుంచి తక్షణం తొలగించాలన్నారు. మూడు నెలల కిందట కడపలో బాధ్యతలు చేపట్టిన అతను తమ శాఖలో మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతుండటం దారుణమన్నారు. ఉద్యోగినిలతో వాట్సాప్‌లో చాటింగ్‌లు చేస్తూ, రాత్రుళ్ళు ఫోన్‌లు చేస్తూ, చివరికి ఇళ్ల వద్దకు వెళ్ళిన కామాంధుడిని కాటికి పంపేంతవరకు ప్రభుత్వం తగు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విధుల నుంచి తొలగించాలి : సహ ఉద్యోగినిపై అసభ్యంగా ప్రవర్తించిన అధికారిపై తక్షణం పోక్స్ కేసు నమోదు చేసి, విధుల నుంచి తక్షణం తొలగించాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. హరి టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటికి వెళ్లి సహ ఉద్యోగిని వేధించడంపై ఆమె భర్త ఆఫీసుకు వెళ్లి దండించారని తెలిపారు. ఈయన విధులు నిర్వహించిన ప్రతిచోట దోచుకున్నారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వంలో అధికారులుగా ఉండి మహిళ పట్ల సంస్కారహీనుడుగా నడుచుకోవడం సరికాదన్నారు. రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వివరించామని తెలిపారు. 20 ఏళ్ల నుంచి కోట్లు వెనకేసుకుని సహ ఉద్యోగినిపై అసభ్యంగా ప్రవర్తించిన అధికారిపై సుమోటోగా కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ఫోక్స్ కేసు నమోదు చేసి, ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి, సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హరిశర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా హామీలు, జిఒలు రాతపూర్వకంగా ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏడు నెలల నుండి కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదన్నారు. రిటైర్డ్ అయిన కార్మికులకు రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంతో మరణించిన కార్మికులకు రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఇఎస్‌ఐ సమస్య పరిష్కరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం, జిఒ నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు, డైలీ వేజ్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులకు పనిముట్లు, దుస్తులు, సబ్బులు, చెప్పులు, శానిటైజర్లు, మాస్కులు గ్లౌజులు, చీపుర్లు వెంటనే ఇవ్వాలన్నారు. 279 జిఒ ప్రకారం 250 నుంచి 500 జనాభా నివసిస్తున్న చోట ఆరుగురు కార్మికులను పనిలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులు అందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. హామీలను వెంటనే

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి.శ్రీనివాసులు, జి.కృష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్షులు కె.చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివ నాయక్, కోశాధికారి పి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాజు, గోపాల్, నరసింహులు, చిన్న రెడ్డెప్ప, బాలకృష?, సహాయ కార్యదర్సులు శ్రీరాములు, మునిస్వామి నాయక్, చంద్ర, అరవింద్, మున్సిపల్ కార్మికులు కృష్ణప్ప, రమణ, బాలకృష్ణ, పార్వతి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థను కార్పొరేట్లకు అప్పగించే యత్నం

- గేట్ మీటింగ్‌లో ఎస్‌డబ్ల్యూఎస్ నాయకులు

చలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పీలేరు

రవాణా వ్యవస్థను కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం పీలేరు ఆర్టీసీ డిపో కార్యాలయం ముందు వారు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో గెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రవాణా వ్యవస్థను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే 2024 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం పిఎం ఇ-బస్ పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఆర్‌టిసిని ప్రయివేటీకరణ చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ పథకం అమలులో భాగంగా విద్యుత్ బస్సుల పేరుతో ప్రయివేట్ యాజమాన్యాలను, కార్పొరేట్లను ఆర్‌టిసిలోకి చొప్పించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. కేంద్ర నిర్ణయాలకు అనుకూలంగా 2029 నాటికి 100 శాతం ఆర్‌టిసి బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలంటూ ప్రభుత్వం జిఒ నెంబరు 88ని గత నెల 11న విడుదల చేసిందని గుర్తు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఇప్పటికే 11,216 బస్సులు ఉండగా, 2,751 అద్దె బస్సులు ఉన్నాయని, అందులో 100 విద్యుత్ బస్సులు ఉన్నాయని చెప్పారు. విద్యుత్ బస్సుల్లో ఒక్క ఆర్‌టిసి ఉద్యోగి కూడా పనిచేయడం లేదని, ఇకముందు 750 విద్యుత్ బస్సులు వస్తే, ఆర్‌టిసిలో 3,700 వరకు ఆర్‌టిసి ఉద్యోగులు, డ్రైవర్లు, మెకానిక్లు, కండక్టర్లకు ఉద్యోగ భద్రత ఉండదని, కార్మిక సంఘాలు ఆందోళన చందే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2029 నాటికి అన్నీ ప్రయివేటు విద్యుత్ బస్సులే ఉంటాయని, ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదని, అంతేకాకుండా ప్రయాణ ఛార్జీల భారం సామాన్యులపై పడే అవకాశాలు ఉన్నాయన్న ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బస్సులకు కేంద్రం ఇచ్చే రాయితీలను ఆర్‌టిసిలకే ఇవ్వాలని, విద్యుత్ బస్సుల నిర్వహణ నేరుగా ఆర్‌టిసికే అప్పగించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ సెక్రెటరీ సి.భాస్కర్, పీలేరు డిపో అధ్యక్షులు కెసిఎస్ రెడ్డి, డిపో కార్యదర్శి హెచ్‌ఎం.బాబు, డిపో కమిటీ సభ్యులు ఎంసి.శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు 11 మద్యం షాపులు : కలెక్టర్

మద్యం షాపులకు లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో కల్లుగీత కార్మికులకు 11 మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కులాలకు సంబంధించి అత్యంత పారదర్శకంగా జిల్లాకు ప్రకటించిన 11 మద్యం షాపులను కలెక్టర్ లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కల్లుగీత కార్మికులకు సంబంధించి కేటాయించిన షాపులను ప్రభుత్వ నిబంధనల మేరకు కల్లుగీత సామాజిక వర్గంలో ఉపకులాలైన గౌడ్, ఈడిగ, గౌడ్, గౌండ్ల నాలుగు ఉప కులాలకు బహిరంగంగా లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించామని పేర్కొన్నారు. రాయచోటి, మదనపల్లి, రాజంపేట మున్సిపాలిటీలు, మండ లాలకు ఈ 11 షాపులు కేటాయించామన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారద ర్శకంగా బహిరంగంగా ఆ వర్గాలకు సంబంధించిన పెద్దలు మీడియా ప్రతిని ధుల సమక్షంలో లాటరీ పద్ధతిలో వీడియోగ్రఫీ చేస్తూ నిర్వహించాం. షాపుల కేటాయింపుపై ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుందని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరిచారులు తీసుకోవడం జరుగుతుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

'అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి'

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చౌకబారు నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. శ్రీకాంత్‌రెడ్డి 15 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి కన్నా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో మంత్రులతో, కేంద్ర మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో బోర్లు, మోటర్లు , పైపులైన్లు వేస్తున్నామన్నారు. శ్రీకాంత్‌రెడ్డి కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ భూములు కేటాయించారు తప్ప ప్రయివేటు వ్యక్తుల భూములు కొనుగోలు చేసి కేటాయించింది లేదన్నారు. నియోజకవర్గంలో గతంలో వైసిపి నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురిచేశారని తెలిపారు. టిడిపి నాయకులు అలాంటి కార్యక్రమాలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో రూ.290 కోట్ల వ్యయంతో 28 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నారాన్నారు. కరువు ప్రాంతమైన రాయచోటి ప్రాంతంలో తాగు, సాగునీటి కోసం అనేక సంవతారాలుగా ఇబ్బందులు పడ్డామని మంత్రి మండిపల్లి కృషితో శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ప్రతిపక్ష నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి నర్సారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గాజుల ఖాదర్‌బాషా, చెన్నూరు అన్వర్‌బాషా, అర్చన విద్యా సంస్థల అధినేత మదన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నాగేశ్వర్ నాయుడు, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపిటిసిలు శివ ప్రసాద్‌రెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, నాయకులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మదనమోహన్, చిన్న రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-సంబేపల్లి(రాయచోటి)

విద్యార్థులు చిన్ననాటి నుండే నైతిక విలువలు పెంపొందించుకోవాలని మానవత స్వచ్ఛంద సంస్థ రాయచోటి శాఖ చైర్మన్ అరమాటి శివ గంగిరెడ్డి సూచించారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ అధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం మానవత విలువలపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు లేని విద్య ఎంత మాత్రం మంచిది కాదని, విద్యార్థులకు విజ్ఞానంతో పాటు విలువలు నేర్పాలని కోరారు. అనంతరం సంస్థ అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాష మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ తో పాటు పట్టుదలతో చదివినప్పుడే ఆశించిన లక్ష్యాలను చేరుకోగలరన్నారు. విలువలతో కూడిన విద్య మాత్రమే సమాజ అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు. అనంతరం సంస్థ కడప అన్నమయ్య జిల్లాల ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ చదివే విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశం ను కుడా అర్థం చేసుకొని మంచి మార్కులు సాదించి ఉన్నతమైన శిఖరాలను చేరుకోవాలని అకాక్షించారు. పాఠశాలలో చదువుపరంగా, విలువల పరంగా మంచి ప్రతిభ కనబరచిన రుక్సానా, నరసింహారెడ్డి, తరుణ్ కుమార్ గౌడ్ అనే ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.వెయ్యి, ద్వితీయ బహుమతిగా రూ.750, తృతీయ బహుమతిగా రూ.500 నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మానవతా సంస్థ సెక్రెటరి అంకం జయచంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్లు సుదర్శన్ రెడ్డి, విల్వపతి రెడ్డి, బి.ఎ.నాగయ్య, శివారెడ్డి, శివరామకృష్ణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన ప్రిన్సిపల్ సెక్రటరీని అభినందిస్తున్న నాయకులు

గిరిజన ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఎస్‌టి నాయకులు

ప్రజాశక్తి-పీలేరు : గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన మూడవత్ మల్లికార్జున నాయక్‌ను పీలేరుకు చెందిన గిరిజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ సెక్రెటరీని పీలేరుకు చెందిన గిరిజన యువ నాయకుడు మూడే హరి చౌహాన్ నాయక్ తన సహచరులతో కలిసి శుక్రవారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో కలిసి ప్రిన్సిపల్ కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మూడే హరిచౌహాన్ నాయక్ గిరిజన సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గిరిజన కార్పొరేషన్ ద్వారా గిరిజనులకి రుణాలు అందజేసి వారి అభివ ృద్ధికి తోడ్పాటు అందివ్వాలని కోరారు. గిరిజనులు ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక చాలా వెనుకబాటుతనానికి లోనయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు ప్రోత్సాహకాలు అందించాలని, గతంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలను పునః ప్రారంభించాలని సెక్రెటరీకి విజ్ఞప్తి చేసినట్లు ఆయన మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దారు నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా 'బోనమల'

ప్రజాశక్తి-రాయచోటి: ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా బోనమల ఖాదర్‌వలీని నియమించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు మాట్లాడుతూ మాదిగలు చేసే న్యాయ పోరాటాలకు తన వంతుగా అండదండలుగా నిలబడతానని ముందుకు వచ్చిన ఖాదరవల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన సువర్ణ రాజుకు ధన్యవాదాలు తెలిపారు. మాదిగల సమస్యల పట్ల అన్ని విషయాలలో కూడా తాను వారికి అండగా నిలబడతానన్నారు. వారికి అవసరమైన సహాయ సహకారాల్లో ముందుంటానని తెలిపారు. భవిష్యత్తులో అనేక కార్యక్రమాల్లో కూడా మేమంతా కలిసి మెలిసి ముందుకు కొనసాగుతామని తెలిపారు.

26న వాల్మీకిపురంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: మహర్షి వాల్మీకిసేవా సమితీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదిన స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షులు విష్ణు చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై 'పరిటాల' పోరాటం అమోఘం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం నిరంతరం పోరాడిన వ్యక్తి మాజీ మంత్రి పరిటాల రవి అని ఎమ్మెల్యే షాజహాన్ బాష, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్ అన్నారు. పరిటాల రవి 20వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక నిమ్మనపల్లి సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమ స్యల పరిష్కారానికై అలుపెరగని కృషి చేసిన పరిటాల రవి పోరాట పటిమను చూసి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారన్నారు. ఎమ్మెల్యే, మంత్రిగా ప్రజలకు విశేషమైన సేవలు అందించారన్నారు. ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకుడుగా, మంత్రిగా బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఉద్యమ కారుడిగా సొంత భూములను పేదలకు పంచిన వ్యక్తి అన్నారు. ధర్మవరంలో మహిళలకు అండగా నిలిచి అరాచక శక్తులుపై పోరాటం చేశారని గుర్తు చేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చి అనంతపురం జిల్లాలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో నవీన్ చౌదరి, షంషేర్, నాదెళ్ల శివన్న, కలకడ వేణుగోపాల్, బోయపాటి మదనమోహన్,నిమ్మనపల్లి మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ, నాదేళ్ల రమేష్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, వెంకటరమణ నాయుడు, లారీ సుధ, కంచర్ల శ్రీనివాసులు నాయుడు, విజయమ్మ, నాగమణి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

- అధికారుల రాకతో పలు దుకాణాలు మూసివేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో యథేచ్ఛగా నిషేధించబడిన బయో ఎరువులు, మందులు విక్రయాలు చేస్తున్న పలువురు దుకాణదారులు అధికారుల తనిఖీలు సమాచారం తెలుసుకొని ఒక్కసారిగా దుకాణాలు మూసివేసి వెళ్లారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, మదనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు శివశంకర్, బి.కొత్తకోట మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ ఏకధాటిగా తనిఖీలు చేస్తుండగా మరోవైపు దుకాణాలు మూసివేయడంతో వ్యవసాయ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు వచ్చే సమాచారం ఎరువుల దుకాణదారులకు ఎలా తెలిసిందని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాసిరకం ఎరువులు, ప్రభావం చూపని పురుగు మందులు రైతులకు విక్రయించి సొమ్ము చేసుకు నేవారు. దీనిపై పలుమార్లు రైతులు ఫిర్యాదు చేసిన స్థానిక వ్యవసాయ అధికారి స్పందించలేదని వాపోయారు. ఇందుకు కారణం వ్యవసాయ అధికారి ఎరువుల దుకాణ అధికారులతో కుమ్మక్కయ్యారని విమర్శలు గుప్పుమన్నాయి. నేడు చోటు చేసుకున్న పరిణామాలకు ఇది అద్దం పడుతోంది. ఎరువుల దుకాణదారుల వ్యవహార శైలితో రైతుల తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, అధికారుల సైతం నివ్వెరపోతున్నారు. వ్యవసాయ అధికారులు పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుకాణాలను సీజ్ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాట్లాడుతున్న జెడిఎ చంద్రనాయక్

మూసివేసిన ఎరువుల దుకాణం

నిబంధనలు పాటించకుంటే చర్యలు : జెడిఎ

నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జెడిఎ చంద్రనాయక్ అన్నారు. ఆకస్మిక తనిఖీలు అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని భవ్యశ్రీ ట్రేడర్స్‌లో సరైన బిల్లులు లేకపోవడంతో రూ.2.90 లక్షల విలువైన మందులను ఎం.వి.ఆర్ సీడ్స్ దుకాణంలో తనిఖీ చేసి రూ.12 వేల అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. ముఖ్యంగా దుకాణదారులు స్టాక్ బోర్డులను బయట తెలుగులో రాసి రైతులకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నేరంగా పరిగణించబడుతుం దన్నారు. రైతులు ఏదైనా పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు. యాప్‌లో ఏ మందులు వాడాలో చూపి స్తుందని రైతులు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు.

అంబేద్కర్ చిత్రపటంతో వేడుకలు నిర్వహించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగాః భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచి వేడుకలు నిర్వహించేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోధిషావలి, జె.రాజశేఖర్ శుక్రవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ లేకుంటే భారతదేశానికి భారతరాజ్యాంగం లేదని తెలిపారు. 1950 జనవరి 26న తొలి గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నామన్నారు. ప్రతి ఏటా జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలలో విధిగా అంబేద్కర్ చిత్రపటంతో నిర్వహించాల్సి ఉండగా జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలలో ఆ నియమాన్ని తుంగలో తొక్కి అవమానిస్తున్నారన్నారు. గతంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, పాఠశాలలో, ప్రయివేట్ రంగ సంస్థల కార్యాలయాలలో పాఠశాలలో, కాలేజీలలో కులవివక్ష ప్రదర్శిస్తూ అంబేద్కర్ చిత్రపటం లేకుండా నిర్వహించి అవమానించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు.

రోడ్డు పనులను అడ్డుకుంటున్న మధురాచారి వీధి ప్రజలు

రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లికి పోయే రోడ్డు వేయడానికి శుక్రవారం పనులు ప్రారంభించడంతో ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉండే మధురాచారి వీధి ప్రజలు మాజీ వార్డు మెంబర్ తోట శివశంకర్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ రోడ్డు వేస్తే మా రోడ్డుతో కలిపి వేయండి లేదా వేయ వద్దు అని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుంచి వర్షం పడితే రోడ్డు పై నీళ్లు నిలబడుతున్నాయని, ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్న రోడ్డు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ రోడ్డు వేస్తే మా ఇళ్లల్లోకి నీళ్లు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్య కి పరిష్కారం చూపి తరువాత రోడ్డు వేయాలని పట్టుపట్టారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాజీ వార్డు సభ్యుడు తోట శివశంకర్ మాట్లాడి అభివృద్ధి పనులను అడ్డుకోవడం మా ఉద్దేశ్యం కాదని అన్నారు. తాత్కాలిక పరిష్కారంగా మధ్యలో రోడ్డు కొంత భాగం వేయకుండా తరువాత వేయాలని సూచించి పనులను ప్రారంభించారు.

సోలార్ కోసం భూముల పరిశీలన

ప్రజాశక్తి-గాలివీడు

తూముకుంటలో ఉన్నటువంటి సోలార్‌కు అదనంగా 114 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం తహశీల్దార్ జె.భాగ్యలత, తూముకుంట ప్రకాష్‌నగర్ కాలనీ ప్రాంతానికి వెళ్లి అక్కడున్న భూములను పరిశీలించారు. రైతులను పిలిపించి వారి పండ్ల తోటలను, పొలాలను పరిశీలించి ప్రతిపాదన జిల్లా కేంద్రాన్ని పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ మురళినాయక్, విఆర్ఒ ఏసుదాసు, పలువురు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

నేడు కలికిరి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలికిరి

మండల సర్వసభ్య సమావేశంలో శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎంపిడిఒ భానుమూర్తిరావు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిడిఒ భాను మూర్తిరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి మండలం అభివృద్ధి, సమస్యల పట్ల చర్చ జరుగుతుందని అన్నారు. ఆయా గ్రామ పంచాయతీ విషయాలు పట్ల అధికారులు పూర్తి సమాచారం కలిగి ఉండి సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

29న గాలివీడులో...

గాలివీడు : ఈనెల 29న గాలివీడు మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిఎ. జవహర్‌బాబు పేర్కొన్నారు. 13వ సర్వసాధారణ సమావేశానికి ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, జడ్పిటిసి, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు. మండల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

అవార్డు గ్రహీత సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్-2025 అవార్డు అందుకున్న డాక్టర్ ఎఆర్ సురేష్‌ను శుక్రవారం స్థానిక విజయభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ బిఎం బిర్లా సైన్స్ సెంటర్, మాస్టర్ కేశవ కరాటే అకాడమీ వారి ఆధ్వర్యంలో మదనపల్లె నుంచి కరాటే గ్రాండ్ మాస్టర్ డాక్టర్ సురేష్ సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్-2025 పురస్కారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, కరాటే రంగంలో విశిష్ట సేవలందిస్తున్న సురేష్‌కు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. యూత్ కరాటే క్లబ్‌కు చెందిన విద్యార్థులకు ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డు-2025ను షేక్. కాలేషా మస్తాన్, డి.ఎ.హేమంష్, ఎన్. ప్రీతం తేజ్ అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


బ్యాంకు ప్రారంభోత్సవంలో మేనేజర్ భానుప్రకాష్,సిబ్బంది

మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు ఎస్‌బిఐ మేనేజర్ కె.భాను ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వెంకోజి గారిపల్లెలోని పోలీసు స్టేషన్ వద్ద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను బ్యాంకు మేనేజర్ భానుప్రకాష్, టిడిపి నాయకులు, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్ రావు, ఓబుల్ రెడ్డి, ఎస్‌బిఐ చిత్తూరు ఆర్‌బిఒ హెచ్.ఆర్ మేనేజర్ బి.శిరీష, హెచ్.ఆర్ డిస్క్ ఆఫీసర్ చంద్రశేఖర్, క్యాష్ ఇన్‌ఛార్జి ఎస్.మహమ్మద్ షఫీ, నిమ్మనపల్లి ఎస్‌బిఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ జి.మనోజ్ కుమార్ లతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఆర్థిక లావాదేవీలను నిర్వహించుకో వడానికి గతంలో తగిన బ్యాంకు సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. ఎస్‌బిఐ తమ నూతన శాఖను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. సోమవారం నుంచి ప్రజలకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బ్యాంకు అకౌంట్లు, బంగారం, వ్యక్తిగత, గృహ రుణాలతో పాటు, ఇన్వెస్ట్‌మెంట్ వంటి సేవలను పొందవచ్చు ప్రజలు అన్నారు. లాఖరు సదుపాయం కూడా ఖాతాదారులకు అందుబాటులో ఉంద న్నారు. ప్రజలు ఎస్‌బిఐ నూతన శాఖలో తమ బ్యాంకు ఖాతాలను తీసుకొని బ్యాంకు సేవలను పొందాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్‌రావు, ఓబుల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేరు మార్పు

అత్తార్ ఖదీర్ అహమ్మద్ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి అత్తార్ అల్లాబకష్, నీలకంఠరావుపేట్ గ్రామం, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు అత్తార్ ఖదీర్ అహమ్మద్ గా వాడుకలో ఉన్న నా పేరును షేక్ అత్తార్ ఖదీర్ అహమ్మద్ గా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు షేక్ అత్తార్ ఖదీర్ అహమ్మద్ గమనించగలరు.

AKSHAY INSTITUTE OF MANAGEMENT
16/375-1-1, GHOUSE NAGAR, DC ROAD, KADAPA

WANTED STAFF

Principal – Eligibility MBA/M.Com., with Ph.D.,
Assistant Professor – MBA/M.Com.,
Those who are eligible for the above posts please bring your Originals and submit your resumes at our office for MBA programme on or before 28-01-2025.
Contact: Correspondent, 9959258721

బాలికా సంరక్షణ మనందరి బాధ్యత

వాల్మీకిపురం: మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చేయి చేయి కలుపుదాం.. సమాజాన్ని మేల్కొలుపుదామని, ఆడ పిల్ల చదువు దేశానికి వెలుగని ఐసిడిఎస్ సిడిఒఎ భారతి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు బాలికలపై లైంగిక వేధింపులు, బాలికల విద్య, రక్తహీనత, పౌష్టికాహారం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి మాట్లాడుతూ బాల్యవివాహాలను అడ్డుకోవాలని, నేటి సమాజంలో బాల్యవివాహాలు మంచివి కాదన్నారు. చిన్నప్పుడే బాలికలకు వివాహం చేస్తే వారి జీవితాల్లో విషాదం నెలకొంటుందన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటలక్ష్మీ, ప్రిన్సిపల్ నవమల్లిక, సూపర్‌వైజర్ రోహిణి కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం:** మహిళలు చట్టాల పైన బాలికలు అవగాహన కలిగి ఉండాలని డిసిపిఒ వినోద్‌కుమార్, లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల గువ్వలచెరువు ఉర్దూ పాఠశాలలో లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, విద్య, ఆరోగ్యం, పౌష్టిక ఆహారం ప్రాముఖ్యత గురించి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి. ఉపాధ్యాయులు సూపర్వైజర్లు పద్మజ, హుస్సేనమ్మ, సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలో కెజిబివి కళాశాల ప్రిన్సిపల్ రూత్‌మేరీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి అవగాహన కల్పించడానికి, ఆడపిల్లల హక్కులు, స్త్రీ విద్యా, ఆరోగ్యం, పోషకాహారం, బాలికా విద్య గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలికల చట్టపరమైన హక్కులు, విద్య, వైద్య సంరక్షణ, వివాహం మొదలైన వాటిపై విద్యార్థులకు తెలియజేసినట్లు చెప్పారు. ముఖ్యంగా బాల్య వివాహాలపై బాలికలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించామని చెప్పారు. బాలికలు శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098 నెంబర్‌ను సంప్రదిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతపల్లి జడ్‌పి హైస్కూల్‌లో కూడా జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ప్రిన్సిపల్ రూత్ మేరీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రధర్‌రాజు, అనంతపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, మణెమ్మ, నిర్మల, అంగన్వాడీ టీచర్లు వనజా కుమారి, రెడ్డెమ్మ, రాధ, లత,రోజా, శ్రీదేవి, రమాదేవి, శ్రీలత పాల్గొన్నారు. **కలికిరి:** జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహల్ సెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఆధ్వర్యంలో కిశోరి బాలికలు తీసుకోవలసిన పౌష్టిక ఆహారం గురించి, బాల్య వివాహాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఎంఎస్‌కె మాట్లాడుతూ టోల్ ఫ్రీ నెంబర్స్ 1098 181 112 100 గురించి వివరించారు. కిశోర బాలికల చేత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు,ఎమ్మెస్ కేలు, అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** బాలికల సంరక్షణ మన అందరి బాధ్యత అని పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సి.రాజమ్మ తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ ఆడబిడ్డలకు జన్మనివ్వాలని, వారు స్వేచ్ఛగా విద్యను అభ్యసించడానికి తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు. అలాగే సమాజంలో ఆడబిడ్డలు పురుషులతో సమానంగా ఎదిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఎన్‌పి.స్వరూప, పి.స్వర్ణ, ఎం.ఉమ, కె.అక్కయ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక చిత్తూరు రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలోనూ జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని పట్టహాసంగా నిర్వహించారు. బాలిక సంరక్షణ చట్టాల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, సిడిపిఒ, ఉపాధ్యాయుల, ఆరోగ్య సిబ్బంది హాజరై బాలికల సంరక్షణ పట్ల అంకితభావంతో పనిచేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.

సంపూర్ణ గ్రామీణాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిట్వేలి

సిసి రోడ్డు ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి, కెకె చౌదరి

సంపూర్ణ గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సి.కందులవారిపల్లి పంచాయతీ రెడ్డిపల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యయం చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఖాదీ గ్రామీణ డెవలప్‌మెంట్ చైర్మన్ కెకె.చౌదరి, టిడిపి యువనాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రతి గ్రామానికి వెలుగులు తీసుకొస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు బాలు రామానుజులనాయుడు, కాకర్ల సుబ్బరాయుడు, సురేంద్రారెడ్డి, చంద్రమోహన్, సాయి వికాస్, కాకర్ల నాగార్జున, కోటి, సుధీర్ రెడ్డి, చక్రవర్తిల వెంకటేష్, రాజు ,ఏదోటి రాజశేఖర్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రామాపురం : గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న వెంకట్రావు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పశు పోషకాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రభుత్వ ఆదేశాల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లి గ్రామంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.రోహిణిలతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరంలో పాడి పశువులకు అందిస్తున్న చికిత్సలను, గొర్రెలు, మేకలు, లేగ దూడలకు వేస్తున్న నట్టనివారణ మందులను పరిశీలించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి పశువుకు, గొర్రెలకు, మేకలకు, దూడలకు అవసరమైన మందులను పంపిణీ చేయాలని పశు వైద్య సిబ్బందికి సూచించామని చెప్పారు. గ్రామంలో పాడి రైతులకు పశు ఆరోగ్య శిబిరాలు తోడ్పాటును అందిస్తాయని, ఈ శిబిరాలకు పశువులను తీసుకువచ్చి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెడ్డివారి పల్లి గ్రామంలో 215 పశువులకు పిచికారి మందులను, 14 గర్భకోశ సమస్యలు గల పశువులకు, 45 దూడలకు నట్ట నివారణ మందులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.రోహిణి, సిబ్బంది ప్రతాప్, శాంతి, గుర్రప్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క కరిచిన వెంటనే టీకా తీసుకోవాలి

రామాపురం : ఎప్పుడైనా పిచ్చికుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రం చేసుకుని ఆ రోజే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రణాళిక విభాగం అదనపు సంచాలకులు వెంకట్రావు తెలిపారు. చిట్లూరు పంచాయతీలోని మజ్జిగ వాండ్లపల్లిలో జంతు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఉచిత పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్క కాటుతో గాయపడిన ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రం చేసుకుని మొదటిరోజు, మూడవరోజు, ఏడవ రోజు, 14వ రోజు, 28వ రోజు క్రమం తప్పకుండా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించారు. అనంతరం 81 పశువులకు ప్రథమ చికిత్స అందించారు. 13 గర్భకోశ, మూడు పశువులకు సూల పరీక్షలు, 183 పశువులకు78 దూడలకు, 1730 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువుల శాఖ అధికారి కె.గుణశేఖర్ పీలై ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, సహాయ సంచాలకులు, సుధీర్‌నాథ్ బెనర్జీ, మండల పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

హెల్మెట్ ప్రయాణం ప్రాణాలకు రక్షణ అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మదనపల్లె పట్టణంలో ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గౌడ్స్ విద్యార్థులు, పోలీసులు భాగస్వామ్యంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణం నుంచి ఆర్‌టిసి బస్టాండ్, సిటిఎం రోడ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండ్, మల్లికార్జున సర్కిల్, అనీబిసెంట్ సర్కిల్, కదిరోడ్డు సుందర్ రాజు పెట్రోల్ బంక్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కొండయ్యనాయుడు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు..వాహన చోదకులు హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోవడం సురక్షితమన్నారు. ఖచ్చితంగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనం నడపని వారి పై జరిమానా విధించడం, ఆ తర్వాత వాహనాన్ని సీజ్ చేయడం, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్‌ను హోల్డ్‌లో ఉంచు తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐలు ఎరిషావల్లి, రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్, ఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, పోర్డు డైరెక్టర్ లళితమ్మ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు తప్పవని మదనపల్లి యంవిఐ శ్రీహరి పేర్కొన్నారు. బి.కొత్తకోటలో రవాణాశాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా,మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్ర వాహనదారులు షీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రహదారి భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** వాహ నదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని సిఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో యంవిఐ వినోద్ ఆధ్వర్యంలో రహదారి భద్రత ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కార్లు భారీ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించి నట్లయితే ఎలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు. అతి వేగంగా వెళ్లడం వేరొక వాహనాన్ని ఓవర్ టేక్ చేయడం వలన తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

27న ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి -బి.కొత్తకోట

ఈనెల 27 వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం మండలం, తుమ్మరకుంట గ్రామ సచివాలయం వద్ద ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉగాది రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. రొమ్ము, గర్భాశయ కేన్సర్, స్క్రీనింగ్ వైద్య నిపుణులు నుంచి స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థ,ప్రోస్టేట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్, స్త్రీ పరిశుభ్రతపై అవగాహన సద స్సు, కేన్సర్ బాధితులకు డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత శస్త్రచి కిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్యంగా ఇసిజి, ఎకో, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు డాక్టర్ లోకేష్ భరణి 7799110121, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 అనే మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పి.మాదిగపల్లి లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్‌రెడ్డి

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. శుక్రవారం హౌసింగ్ ఎఇ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి టి. మాదిగపల్లి లేఅవుట్‌ను ఆయన సందర్శించారు. లేఅవుట్‌లో 21 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయగా అందులో ఐదు ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన గృహాలు బేస్‌మెంట్ స్థాయిలో పది గృహాలు, లింటిల్ స్థాయిలో రెండు, రూఫ్ లెవెల్ స్థాయిలో మూడు, మోల్డింగ్‌లో ఒక గృహం ఉన్నట్లు తెలిపారు. నిర్మాణ దశల్లో ఉన్న లబ్ధిదారుల అందరితో ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ మాట్లాడారు. మార్చి నెలాఖరకు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు, మెటీరియల్స్ మంజూరు కావని తెలిపారు. ఇప్పుడు మంజూరైన స్కీమ్‌లో అర్హులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోక పోతే భవిష్యత్తులో ప్రభుత్వం మంజూరు చేయబోవు స్కీమ్‌లలో అర్హత ఉండదని చెప్పారు. ప్రభుత్వం తరపున ఎన్‌ఆర్‌ఇజిఎస్, వెలుగు, సంఘమిత్రల ద్వారా రుణాలు కూడా ఇప్పించడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 17 గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసు కోవాలని ఎంపిడిఒ సిఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్, ఉపాధి సిబ్బందితో సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 385 గృహాలకు బిల్లులు పెండిగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉపా ధి హామీ కింద 90 రోజుల బిల్లులు ఇవ్వాల్సిన వాటిపై కూడా పొరపాటు జరగకుండా సకాలంలో పూర్తి చేయాలని తెలి పారు. ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా మండల కేంద్రానికి కూడా వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా సకాలంలో బిల్లులు మంజూరయ్యాలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ బి.రమేష్‌నాయక్, ఎపిఒ రామ చంద్రయ్య, డిజిటల్ అసిస్టెంట్లు ఉపాధి టిఎలు, సిబ్బంది పాల్గొన్నారు. హౌసింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ షాకీర్ పాల్గొన్నారు.

పింఛనుదారుల వికలత్వాన్ని పరిశీలిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

విభిన్న ప్రతిభావంతుల పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక బోగస్ పింఛన్ల ఏరివేతకు అధికారులు వైద్య బృందంచే విచారణ చేపట్టారు. మంచానికే పరిమితమైన వారికి కూటమి ప్రభుత్వం రూ.15 వేలకు పెంచి ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొనసాగిస్తుంది. అనర్హులు కొందరు బోగస్ సదరం సర్టిఫికెట్లను సమర్పించి నెలనెలా పెన్షన్ పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అధికారుల బృందం సోమవారం నుంచి మండలంలోని విభిన్న ప్రనతిభావంతుల పింఛన్లను తనిఖీ చేస్తున్నారు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పెన్షన్ కోసం వారు సమర్పించిన ధ్రువపత్రాల పరిశీలిస్తూ నివేదికలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని 18 మంది ప్రత్యేక ప్రతిభావంతుల పింఛన్ దారులు ఉన్నాయి.కడప రిమ్స్ ఆస్పత్రి ప్రొఫెసర్, పుల్లంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మనోజ్ కుమార్, ఎఒ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సామాజిక పెన్షన్లు అందుకుంటున్న బోగస్ లబ్ధిదారుల ఏరివేతకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 18 మంది ప్రత్యేక ప్రతిభావంతుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి వేమయ్య, డిజిటల్ అసిస్టెంట్ రమణ, నారాయణ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ అనిల్, రంగా, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండ వేలం పాట ఆదాయం రూ.16.14 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాల సందర్భంగా వాహనాల పార్కింగ్ వేలంపాటను కొండపై శుక్రవారం నిర్వహించారు. వేలం పాటలో వాహన పార్కింగ్ శ్రీ రెడ్డప్పరెడ్డి రూ.4.72లక్షలు, తలనీలాల వసూలు కె.బాలకృష్ణ 3.51లక్షలు, గౌరమ్మ పూజ సామగ్రి టి.బాలయ్య రూ.3.81లక్షలు, ఏనుగు మల్లమ్మ పూజ సామగ్రి ఎం.శేఖర్ రూ. 2.22 లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పల సేకరణ టి .గోపాలకృష్ణ రూ.81వేలు, లడ్డూ విక్రయం కె.మోహన రూ.4.81లక్షలకు వేలంపాట పాడి నట్లు తెలిపారు. వేలంపాట ద్వారా ఆలయానికి రూ.16.14లక్షల ఆదాయం వచ్చినట్లు ఇఒ మునిరాజు తెలిపారు. కూటమి నాయకులు, పోలీసుల ఆధ్వ ర్యంలో ఆలయ అధికారులు, శశికుమార్, దేవస్థానానికి సంబం ధించిన సభ్యు లతో బహిరంగ వేలం పాట జరిగిందని తెలిపారు.

అన్న క్యాంటీన్ నిర్మాణాలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు: పీలేరులో ఎన్‌టిఆర్ గృహాలు, అన్న క్యాంటీన్ నిర్మాణాల కోసం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం స్థానిక తిరుపతి రోడ్డు, ఎపిఐఐసి లేఅవుట్లలో గృహ నిర్మాణాలకు అవసరమైన స్థలాలను చూశారు. స్థానిక వ్యవసాయం మార్కెట్ కమిటీ ఆవరణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలకు నివేశ స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలు చేపట్టడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపడుతోందని అన్నారు. పీలేరు పట్టణ ప్రజల అవసరాల కోసం తగిన స్థలాలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

కోడి పందేం స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని ఎగువగొట్టివీడు నగిరి వద్ద శుక్రవారం కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసి రెండు కోళ్లు , నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పి.శ్రీరాములు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.3,530లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.